ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0
యాదాద్రి భువనగిరి
5
మంగళవారం 12 నవంబరు 2024





కార్తీక సోమవారం సందర్భంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసరగుట్ట రామలింగేశ్వర స్వామిని కలెక్టర్ హనుమంత్‌రావు దర్శించుకున్నారు.

న్యూస్ బాక్స్

సర్వేలో 21రకాల వైకల్యాలను నమోదు చేయాలి

దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు సుర్వంగ ప్రకాశ్



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వైకల్యాలను నమోదు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు సుర్వంగ ప్రకాశ్ కోరారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ ఏవో జగన్‌మోహన ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వేఫాం పార్ట్-1, 13వ కాలంలో దివ్యాంగుల గురించి ఉందని, 2016 దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలను నమోదు చేయాలన్నారు. హ్యాండ్‌బుక్‌లో వైకల్యం గురించిన వివరాలు సమగ్రంగా లేవన్నారు. గత ప్రభుత్వం దివ్యాంగులను ఏనాడూ పట్టించుకోలేదని, మార్పు తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సైతం గత ప్రభుత్వ బాటలోనే నడుస్తోందన్నారు. 21 రకాల వైకల్యాలకు సంబంధిత కోడ్‌లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో స్వామి, లలిత, శ్యాంసుందర్, వెంకటేశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి సదరం క్యాంపు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సదరం స్లాట్ బుక్ చేసుకున్న వారు నిర్ణయించిన తేదీల ప్రకారం హాజరు కావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చిన వారు ఈనెల 13, 20, 22, 26, 27 తేదీల్లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి ఆధార్, రేషన్, ఓటరు కార్డు, డాక్టర్ రిపోర్టులు, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకుని హాజరు కావాలన్నారు. సంబంధిత వైద్యులు పరీక్షించి వైకల్య శాతాన్ని నిర్ధారించి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. వైద్యులు అందుబాటులో లేకుంటే సదరం క్యాంపు రద్దు చేస్తామని ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఉద్యోగులకు రక్షణ లేకపోవడం బాధాకరం

ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి చేయడం దురదృష్టకరమని ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు.ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కలెక్టర్‌పై దాడి సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేసే ఉద్యోగులకు రక్షణ లేకపోవడం బాధాకరం అని అన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కావొద్దన్నారు. అదేవిధంగా ఈ ఘటనను పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం అధ్యక్షుడు గణగాని శశికాంత్‌గౌడ్ ఖండించారు.

అన్ని మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు నిలిపివేత

పత్తి కొనాలని సాయంత్రానికి సీసీఐ ఆదేశాలు



మోత్కూరు మార్కెట్‌లోని సీసీఐ కేంద్రం

మోత్కూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మార్కెట్ పరిధిలో ఇటీవలే జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఒకట్రెండు రోజులుగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఇంతలోనే సీసీఐ ఎల్- 1, ఎల్- 2, ఎల్-3 పేరుతో కఠిన నిబంధనలు విధించింది. దీంతో కొన్ని మిల్లులకు మాత్రమే పత్తి కొనే అవకాశం కల్పించారు. ఈ నిబంధనలతో పత్తి విక్రయంలో రైతులు ఇబ్బందులకు గురవుతుండడంతో కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఇం డస్ట్రీస్ యజమానుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మోత్కూరు మార్కెట్ పరిధిలోని జిన్నింగ్ మిల్లులకు యజమానులు తాళాలు వేసి పత్తి కొనలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచి పోవడంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి సూచన మేరకు మార్కెటింగ్ డైరెక్టర్, సీసీఐ సీఎండీ తదితరులతో జరిగిన సమావేశంలో పత్తి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. సోమవారం సాయంత్రం జిన్నింగ్ మిల్లుల యజమానులకు ఈ ఆదేశాలు అందాయని, మంగళవారం నుంచి యథావిధిగా పత్తి కొంటామని మిల్లుల యజమానులు తెలిపారు.

యాసంగి సాగుకు సన్నాహాలు



- 3.19లక్షల ఎకరాలు అంచనా
- పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక
- మండలాల వారీగా రూపొందించిన వ్యవసాయశాఖ

యాసంగిలో పంటల సాగుకు జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికలతో సన్నద్ధమవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. జిల్లాలో పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు కొంత మేర పెరిగాయి. దీంతో ఈ సారి యాసంగి సాగు పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు మండలాల వారీగా వ్యవసాయశాఖ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరికోతలు ఊపందుకున్నాయి. మరో 15రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కానున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. ఈ కొనుగోళ్లు పూర్తయిన వెంటనే యాసంగి పంటలపై రైతులు దృష్టి సారించనున్నారు. ఈ నేపథ్యంలో పంటల సాగుపై ముందస్తు కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేస్తోంది.

– (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

జిల్లాలో 17 మండలాల్లోనూ వరితో పాటు పలు రకాలు పంటలు సాగు చేస్తారు. యాసంగిలో జిల్లాలో మొత్తం 3,19,320 ఎకరాల్లో పలు పంటలను సాగు చేయనున్నట్టు వ్యవసాయశాఖ అంచనా రూపొందించింది. ఈ మేరకు మండలాల వారీగా ఏ పంటలు సాగు చేసే పరిస్థితి ఉందని అధికారులు పరిశీలించారు. సాగునీటి ప్రాజెక్టుల కింద సాగు లేకపోవడంతో ఆరుతడి పంటలకు రైతులు అంతగా ప్రాధాన్యం ఇవ్వడంలేదు. జిల్లాలో 2,98,000 ఎకరాల్లో వరి, 65 ఎకరాల్లో మిల్లెట్స్, 31 ఎకరాల్లో పప్పులు, 55 ఎకరాల్లో నూనె గింజలు, 21,150 ఎకరాల్లో కంది, పెసర్లు, జొన్న, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేయనున్నట్టు అంచనా వేస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో వరి కోతలు పూర్తయి, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు ఊపందుకున్నాయి. కోతలు పూర్తికావడంతో యాసంగి పంటకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. మరో వారం రోజుల్లోగా పొలాల దుక్కులు దున్నడం ప్రారంభించనున్నారు. ఈ మేరకు రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో యాసంగిలో వరి పంటకు బదులు మినుము, పెసర, నువ్వులు, పొద్దు తిరుగుడు, వేరుశనగ, శనగలు తదితర ఆరుతడి పంటలు సాగు చేయాల్సిందిగా సూచిస్తూ అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఈ యాసంగి సీజన్‌లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని ప్రత్యేకంగా అధికారులు ఎలాంటి ప్రణాళికలు రూపొందించలేదు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

జిల్లాలో మొత్తం యాసంగిలో 3.19లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసేందుకు వ్యవసాయశాఖ అంచనాలు రూపొందించింది. ఈ నేపథ్యంలో సాగుకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో యాసంగిలో మొత్తం 74,500 క్వింటాళ్ల వరి విత్తనాలు, 5.20 క్వింటాళ్ల మిల్లెట్స్

- మిగతా 8వ పేజీలో...



3.19లక్షల ఎకరాల్లో సాగు అంచనా



యాసంగిలో జిల్లాలోని 17 మండలాల్లో 3.19లక్షల ఎకరాల్లో పలు రకాల పంట లు సాగుచేసేందుకు అంచనాలు రూ పొందించాం. మరో 15 రోజుల్లోగా యాసంగి సీజన్ ప్రారంభం కానుంది. ఈ మేరకు మండలాల వారీగా ఏ పంటలు సాగు చేసే అవకాశం ఉందనే వివరాలు సేకరించాం. యాసంగిలో వరి అధిక శాతం జిల్లా రైతులు సాగుచేస్తారు. అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో పర్యటించి, రైతు వేదికల ద్వారా రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

సన్నధాన్యమంతా మిర్యాలగూడకే!



- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా వస్తున్న ధాన్యం
- ఇదే అదునుగా ధర తగ్గిస్తున్న మిల్లర్లు
- ప్రస్తుతం ధాన్యమంతా నాన్ ఆయకట్టు నుంచే
- సాగర్ ఆయకట్టు ధాన్యం వస్తే ఒత్తిడి పెరిగే అవకాశం



నల్లగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైస్ మిల్లులకు సన్నధాన్యం పోటెత్తుతోంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి భారీగా సన్న ధాన్యం మిర్యాలగూడకు వస్తుండడంతో ఇదే అదునుగా మిల్లర్లు ధర తగ్గిస్తున్నారు. దీంతో రైతు లు ఆందోళనలకు దిగుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం విక్రయిస్తే మద్దతు ధరతో పాటు, రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, రైతులు మా త్రం నేరుగా మిల్లులకే ధాన్యం తీసుకొస్తుండటంతో మిర్యాలగూడలో మిల్లుల వద్ద రద్దీ పెరిగింది. ప్రస్తుతానికి నాన్‌ఆయకట్టు ధాన్యమే రోజుకు మూడువేల ట్రాక్టర్ల వరకు వస్తోంది. మరో వారంలో సాగర్ ఆయకట్టులో కోతలు ప్రారంభమైతే ఆరు వేల ట్రాక్టర్ల వరకు ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, మద్దతు ధర దక్కాల న్నా మిల్లుల వద్ద కొనుగోళ్లపై అధికార యంత్రాంగం నిత్యం పర్యవేక్షణ చేయాలని, టోకె న్ల విధానంలో లోపాలు లేకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం ట్రాక్టర్లు బారులు

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి సూర్యాపేట జిల్లాలో జరుగుతున్నా, ఆధునిక టెక్నాలజీ, అధిక మిల్లింగ్ సామర్థ్యం కలిగిన రైస్‌మిల్లులు మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నాయి. జిల్లాలో అత్యధిక ధాన్యం ప్రధానంగా సన్నధాన్యం మిర్యాలగూడ మిల్లులకే వస్తోంది. సూర్యాపేట జిల్లాలో మిల్లుల్లో ఆధునిక టెక్నాలజీ లేకపోవడం, మిల్లింగ్ సామర్థ్యం స్వల్పంగానే ఉండడంతో

- మిగతా 6వ పేజీలో...

మిల్లర్లతో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కు

రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్



చౌటుప్పల్ లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేయిస్తున్న లక్ష్మణ్

చౌటుప్పల్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిల్లర్లతో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లను ఆయన సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రైతులు ఎంత ప్రాధేయపడుతున్నా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, పుల్లారెడ్డి అనే రైతు 35 రోజులుగా తూకాల కోసం ఎదురుచూస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి ఎగుమతి చేసిన ధాన్యాన్ని మిల్లర్లు తిప్పి పంపడం విచిత్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో 93లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు రూ.27వేల కోట్లను ఖర్చు చేస్తోందని అన్నారు. ధాన్యం కొనుగోలుకు ప్రతీ పైసా కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తోందని, కేవలం తూకం వేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపడం బాధాకరమన్నారు. అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన కాంగ్రెస్ నేడు సన్నాలకు మాత్రమే ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనని ఆయన అన్నారు. సమావేశంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, నాయకులు దూడల భిక్షంగౌడ్, రమనగోని శంకర్, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, పి.శ్రీధర్‌బాబు, కంది లక్ష్మారెడ్డి, డి.భిక్షమాచారి, ముత్యాల భూపాల్‌రెడ్డి, పక్కీర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

35 రోజులుగా తూకాలు వేయడం లేదు

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 35 రోజులుగా ప్రాధేయపడుతున్నా తూకాలు వేయడం లేదని రైతు చింతపల్లి పుల్లారెడ్డి రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌కు మొరపెట్టుకున్నాడు. 1,100 బస్తాల ధాన్యాన్ని తీసుకొచ్చానని, రెండుసార్లు కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రూ.30వేల ఖర్చు వచ్చిందని, రూ.1,000 లంచం ఇచ్చిన వ్యక్తుల ధాన్యం తేమశాతం రాకున్న తూకాలు వేయిస్తున్నారని వివరించాడు.

(ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్ రూరల్): కే.లక్ష్మణ్ మండల పరిధిలోని జైకేసారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో శేఖర్‌రెడ్డితో కలిసి సందర్శించి రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు.

లంచం ఇస్తేగాని తేమ చూడరా

రైతులు లంచం ఇస్తేగాని తేమ చూడరా అని ఏఈవో కృష, పీఏసీఎస్ సెక్రటరీ వైరమేష్‌పై లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పుల్లారెడ్డికి చెందిన ధాన్యం తేమ శాతం పరిశీలించగా 15.8 రావడంతో అధికారులను లక్ష్మణ్ నిలదీశారు. పుల్లారెడ్డి ధాన్యానికి వెంటనే తూకం వేయించాలని, ఆ తరువాతే తాను ఇక్కడి నుంచి వెళ్తానని భీష్మించారు. దీంతో అధికారులు ధాన్యాన్ని తూకం వేయించారు. కలెక్టర్‌కు ఫోన్ చేసి తూకాల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, చౌటుప్పల్ ప్రాంతం నుంచి వెళ్తున్న ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ లక్ష్మణ్‌కు పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



తుర్కపల్లి మండలం పెద్దతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి, బొమ్మలరామారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులకు సూచించారు. సోమవారం తుర్కపల్లి, పెద్దతండా, మాదాపూర్, బొమ్మలరామారం మండల కేంద్రంతోపాటు నాగినేనిపల్లి, మైలారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. బొమ్మలరామారం పీఏసీఎస్ సీఈవో జహేందర్ విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధుల నుంచి సస్పెండ్ చేశారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి సురేశ్, తహసీల్దార్లు దేశ్యానాయక్, శ్రీనివాసరావు ఉన్నారు.

సర్వే వివరాలన్నీ గోప్యమే

భువనగిరి టౌన్, తుర్కపల్లి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా కుటుంబ సర్వే వివరాలన్నింటినీ ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుందని కలెక్టర్ హనుమంతురావు అన్నారు. సోమవారం భువనగిరి, తుర్కపల్లిలో సాగుతున్న సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు.పూర్తయిన సర్వే ఫారాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మునిసిపల్ కమిషనర్ పి.రామాంజుల్ రెడ్డి, ఎంపీడీవో ఝాన్సీలక్ష్మిబాయి ఉన్నారు.

విద్యావ్యవస్థకు మూలం అబుల్ కలాం

(ఆంధ్రజ్యోతి, భువనగిరి (కలెక్టరేట్)): దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అని కలెక్టర్ హనుమంతరావు కొనియాడారు. అబుల్‌కలాం జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు.

మూసీ ప్రక్షాళన కాదు.. నీ నోటిని ప్రక్షాళించుకో

ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

ఆలేరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన చేయడం కాదు.. నిత్యం అబద్ధాలాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి నోటిని ప్రక్షాళించుకోవాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. సోమవారం ఆలేరులో రహదారి బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను అడుగడుగునా వంచన చేస్తున్నారని విమర్శించారు. నాటి సీఎం కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వేను ఒక్క రోజులో చేసి చరిత్రలో నిలిచిపోయారని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం 60 రోజుల సర్వే చేపట్టి రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనన్నారు. 2014లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లను అడ్డమైనోళ్లు అని వ్యాఖ్యానించారని, ఇప్పుడు అలాంటి వారితో ఎలా సర్వే చేయించుకుంటున్నావని ప్రశ్నించారు. పాఠశాలలు సగం పూట నడిపి ఉపాధ్యాయులతో సర్వే చేయిస్తుండటంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందన్నారు. రాష్ట్ర ప్రజలు సంపూర్ణంగా ఆనందంగా లేరని, కేసీఆర్‌ను గెలిపించుకోలేక తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. బీసీ కుల గణనపై ప్రజల్లో భయాందోళనలు ఉన్నాయని, వ్యక్తిగత సమాచారాన్ని అడగడం సక్రమం కాదన్నారు. సమావేశంలో ఆలేరు మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, మాజీ సర్పంచ్ కోటగిరి పాండరి, నాయకులు కోరికొప్పుల కిష్టయ్య, గ్యాదపాక నాగరాజు, వెంకటేష్, ఎండి.జమాల్, జహంగీర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మోత్కూరులో తేమశాతం చూస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోత్కూరు, అడ్డగూడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. మోత్కూరు మార్కెట్ యార్డులో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో, పాటిమట్ల, అడ్డగూడూరు మండలంలోని డి.రేపాక ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం తనిఖీచేశారు. మోత్కూరు కొనుగోలు కేంద్రాన్ని గత నెల 25న ప్రారంభించినా ఈ నెల 10వ తేదీ వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడంపై నిర్వాహకులను ఆయన ప్రశ్నించారు. మిల్లు అలాట్ అయినా మిల్లర్ ధాన్యం తీసుకోవడం లేదని నిర్వాహకులు తెలపడంతో పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌తో మాట్లాడి, ధాన్యం నిల్వ చేయడానిక గోదాం కేటాయించాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇక్కడి రిజిస్టర్లను ఆయన పరిశీలించగా తేదీలు వేయకుండా, ధాన్యం తీసుకువచ్చిన రైతుల పేర్లు మాత్రమే రాయడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పరమేశ్వరి రైస్‌మిల్లు తనిఖీ చేశారు. ఏ-గ్రేడ్, సాధారణ రకం ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడంలేదని మిల్లర్‌ను ప్రశ్నించగా రైతులే తీసుకురావడం లేదని ఆయన సమాధానమిచ్చారు. అదనపు కలెక్టర్ వెంట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ డి.రాంప్రసాద్, ఉన్నారు.



కూలీకి కొరగాని రైతు

- ఒకరోజు కష్టార్జితం రూ.172లే
- సన్నాల సాగుతో రైతు కుదేలు
- ప్రైవేట్ విత్తనాలకే డిమాండ్

ఈ ఏడాది సన్న ధాన్యం సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం విక్రయించగా ప్రతిఫలంగా రోజు కూలి అంత కూడా గిట్టుబాటు కావడం లేదు. నారుమళ్లు, మందుల కొనుగోళ్లు, పిచికారీ, కోతల ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతున్నాయి. వెరసి రైతు కష్టానికే కన్నంపడుతోంది. ఈ ఏడాది వరుణుడు కరుణించినా ప్రతికూల వాతావరణ ప్రభావంతో వానాకాలం పంటల సాగు చివరకు రైతులకు కన్నీళ్లే మిగులుస్తోంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ,(వ్యవసాయం)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బోరుబావుల ఆధారంగా 5 లక్షలు, సాగర్ ఆయకట్టులో 6.50లక్షలు, వివిధ ప్రాజెక్టుల కింద 1.50 లక్షలు మొత్తం 13లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రైవేటు రకాల సన్నాలు 80శాతం, సాంబమసూరి 15 శాతం, దొడ్డు రకాలు ఐదు శాతం మేర సాగు చేశారు.

చిన్న బోయిన సన్నాలు

దశాబ్దకాలంగా వివిధ ప్రైవేట్ కంపెనీలకు చెందిన అతి సన్నర కాలైన హెచ్ఎంటీ, చింట్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. రైతులు వానాకాలంలో 80శాతం ఈ రకాలనే సాగు చేస్తారు. అయితే ఇవి వాతావరణ మార్పులను తట్టుకోలేక తెగుళ్ల బారిన పడుతున్నాయి. ఈ ఏడాది వానాకాలంలో ఆకుచుట్టుపురుగు వ్యాప్తితో పంటలు దెబ్బతిన్నాయి. మొదట్లో మాత్రమే వచ్చే ఈ పురుగు ఈసారి 3-4పర్యాయాలు రావడంతో ఎకరానికి(ఒక పిచికారీకి) రూ.2వేల మందులు వాడినా ప్రయోజనంలేదని రైతులు వాపోతున్నారు. మొగిపురుగు, దోమ, కంకినల్లి వరస తెగుళ్లతో రైతులు విసిగిపోయారు. కనీసం ఐదు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చిందని దాంతో పెట్టుబడులు భారీగా పెరిగాయంటున్నారు.

దిగుబడులపై ప్రభావం

సన్న రకాలకు తెగుళ్ల వ్యాప్తితో పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. వరి కర్ర బలహీనంగా మారింది. ఆశించిన మేరకు కంకి రాలేదు. జూలైలో నాటు వేసిన పొలాలు చేతికొచ్చే సమయంలో వర్షం కురిసి చాలావరకు వాలిపోయాయి. కంకులు నేలకు తగలడంతో గింజ రంగు మారింది. గింజ నల్లగా ఉందని మిల్లర్లు క్వింటా రూ.2వేలలోపు చెల్లించినట్లు రైతులు చెబుతున్నారు. కొన్ని పంటలు చూడటానికి బాగానే ఉన్నా ఎకరాకు 30-35 బస్తాల దిగుబడి రాలేదు. కంకినల్లి వ్యాప్తితో గింజ సరిగా పాలు పోసుకోకపోవడంతో తూకం బాగా తగ్గింది. ధాన్యం రాక పెరగడంతో హెచ్ఎంటీ రూ.2,200, చింట్లు క్వింటాకు రూ.2,300లకు మించి మిల్లర్లు చెల్లించడంలేదు. దాంతో రైతులకు ఈ వానాకాలం కన్నీరే మిగిల్చింది.

వరి సాగుకు ఖర్చు (ఎకరాకు)	
దుక్కులు - 8 సార్లు	రూ.8వేలు
విత్తనాలు 15 కిలోలు	రూ.1500
నారుమడి యాజమన్యం	రూ.500
గెట్లు తియ్యడం	రూ.1000
అడుగు పిండి(2బస్తాలు)	రూ.2,500
నాటు కూలీలు	రూ.5వేలు
కలుపుకు తీసేందుకు	రూ.1000
యూరియా 120 కిలోలు	రూ.800
పిచికారీకి(4-5సార్లు)	రూ.8,000
కోతలు	రూ.3500
ధాన్యం రవాణా చార్జీలు	రూ.5,004
మొత్తం పెట్టుబడి	రూ.32,300

- దిగుబడి (ఎకరాకు) : 30 బస్తాలు (21 క్వింటాలు), క్వింటాకు మద్దతు ధర 2,300 ఆ మేరకు ఆదాయం రూ.48,300.
- ఎకరాకు 35 బస్తాలు (సుమారు 24 క్వింటాళ్లు) దిగుబడి వస్తే ధర రూ.2,300 ఆ మేరకు ఆదాయం రూ.55,200
- పెట్టుబడి ఎకరాకు రూ.31,800 పోను 30 బస్తాలు దిగుబడి వస్తే రూ.16 వేలు, 35 బస్తాలు దిగుబడికి రూ.22,900 మిగులుబాటు.

కౌలు రైతు అధోగతే

సొంతభూమి ఉన్న రైతులకు పంట సాగు గిట్టుబాటు కాకపోతే కొంతమేరకు నష్టం. అదే కౌలు రైతు మరింతదారుణం. సాధారణంగా వానాకాలం సీజన్‌లో నీటి వనరులను అనుసరించి 14-బస్తాలు(10క్వింటాళ్లు) కౌలు వరకు(ఎకరాకు) ఉంటుంది. క్వింటాకు రూ.2,300 లెక్కన రూ.23వేలు కౌలు చెల్లించాలి. పెట్టుబడి రూ.31,800 కలిపితే రూ.54,800 అవుతుంది. 30 బస్తాల దిగుబడి వస్తే పెట్టుబడి, కౌలు పోను రూ.6,500 నష్టం వాటిల్లుతోంది. 35 బస్తాలు వస్తే ఎకరాకు మిగిలేది రూ.400. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 80వేల మంది కౌలు రైతులు ఉన్నారు. ఎకరాకు 30బస్తాలు దిగుబడి వస్తే సుమారు రూ.52 కోట్ల నష్టం వాటిల్లుతుండగా, 35 బస్తాల దిగుబడి వస్తే ఎటువంటి మిగులు బాటులేదు. ఈ పరిస్థితిలో కౌలు రైతు అప్పుల పాలవడం మినహా మరో దారి లేదు.

రైతుకు కూలి కూడా గిట్టలేదు

సుమారు నాలుగు నెలలు పంటల సాగు పర్యవేక్షణ ఉంటుంది. ఎకరం వరికి వచ్చే ఆదాయం రూ.16వేల నుంచి రూ.22,900కాగా నెలకు రూ.4 నుంచి రూ.5,725లు మాత్రమే రైతుకు గిట్టుబాటు అవుతోంది. రోజుల లెక్కన రూ.120 నుంచి రూ.172లు అన్నమాట. కూలికి పోతే మహిళలకు రూ.300 నుంచి రూ.400 మగవారికి రూ.800 వరకు ఇస్తుంటారు. అయితే సాగు చేస్తే రైతుకు మాత్రం కనీసం కూలి గిట్టుబాటు కావడం లేదు. ఇదీ అన్నదాత దుస్థితి.

ప్రభుత్వం దృష్టి సారించాలి

ప్రైవేట్ వరి వంగడాలు రైతులకు శాపంగా మారగా విత్తన కంపెనీలు, వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. గిట్టుబాటు కాకపోయినప్పటికీ, మార్కెట్లో వీటికి మినహా మరే రకానికి పెద్దగా ఆదరణ లేకపోవడంతో తప్పనిసరై సాగు చేస్తున్నారు. ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల నుంచి వచ్చిన వంగడాలకు మార్కెట్‌లో డిమాండ్ లేదు. పచ్చి ధాన్యం(ఆరబెట్టకుండా) విక్రయించే అతి సన్నరకాల తయారీపై పరిశోధనా సంస్థలు ప్రత్యేక శ్రద్ధ వహించి అందుబాటులోకి తీసుకువస్తేనే ప్రయోజనకరంగా ఉంటుంది.

సన్నాలతో నష్టపోతున్నాం



ఐదెకరాలు కౌలుకు తీసుకుని చింట్లు రకం సాగు చేశా. పంట వేసి దగ్గర నుంచి పచ్చపురుగుతో పాటు వివిధ రకాల తెగుళ్ల వ్యాపించాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా తగ్గలేదు. ఎకరానికి రూ.30వేలపైన పెట్టిన. 30బస్తాలు మించి దిగుబడి రాలేదు. మార్కెట్లో క్వింటాకు రూ.2,300 మించి కొనడం లేదు. కౌలు పోను నష్టంవాటిల్లింది.

వైట్ల హరికృష్ణ, వరి రైతు

వానాకాలం సీజన్ పొలాలు కోత దశలో ఉన్నాయి. కొన్నిచోట్ల వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కాస్త ఆలస్యంగా సాగు చేసిన చోట మరో రెండు వారాల్లో చేతికి రానున్నాయి. గతంలో వ్యవసాయ కూలీలు పంటలు కోసి నూర్పిడి చేసేవారు. ప్రస్తుతం వరి కోత యంత్రాలను వినియోగిస్తున్నారు. అర ఎకరం ఉన్నా యంత్రాన్నే వాడుతున్న పరిస్థితి. అయితే ఈ ఏడాది కోత మిషన్ల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. పంటలు నూర్పిడికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

కోత మిషన్లకూ కొరతే

- సరిపోను లేక ఇబ్బందులు
- పంట నూర్పిడి ఆలస్యం
- అదనపు భారమంటున్న రైతులు

వానాకాలం సీజన్‌లో మునుపెన్నడూ లేనివిధంగా నల్లగొండ జిల్లాలో వరి సాగు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురియడంతో పాటు, రెండేళ్ల తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండటంతో కాల్వలకు నీటిని విడుదలచేశారు. అదేవిధంగా చెరువులను సైతం సాగర్ నీటితో నింపారు.దీంతో జిల్లాలో గణనీయంగా 5.40 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. నిడమనూరు మండలంలో 35వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకున్నాయి. ఇదిలా ఉండగా గతంలో వరి చేలు కోయడానికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వరి కోత యంత్రాలు వచ్చేవి. గంటకు రూ.200 చొప్పున కమీషన్లు మాట్లాడుకొని దళారులు వీటిని తీసుకువచ్చేవారు. గతంలో వరి కోతల సీజన్‌లో అన్నిగ్రామాల్లో 10 కోతమిషన్ల చొప్పున కనపడేవి. కానీ అన్ని రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురియడంతో అక్కడా సాగు పెరిగి వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఈ సీజన్‌లో సరిపోను యంత్రాలు లేక పంటల నూర్పిడికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. వరి సాగుకు అనుగుణంగా కోతమిషన్లు రాలేదు. దీంతో వరి కోతలకు రోజుల తరబడి ఎదురుచూడాల్సివస్తోంది. ఇటీవల వర్షాలతో చేతికి అందే దశలో ఉన్న పంట నేలకొరిగింది. ఈ పంటను కోయడానికి అదనపు సమయం పడుతోంది.

చైన్‌మిషన్లకు డిమాండ్

వానాకాలం సీజన్‌లో ఎక్కువగా చైన్‌మిషన్లకు డిమాండ్ ఉంటుంది. టైర్‌మిషన్లకు గంటకు రూ.2 వేలు ఉన్నప్పటికీ వానాకాలం సీజన్‌లో యంత్రాలు పొలంలో దిగబడే అవకాశం ఉంటుంది. పైగాధాన్యం కూడా తక్కువగా వస్తుంది. దీంతో రైతులు చైన్‌మిషన్ వైపు మొగ్గుచూపిస్తారు. గ్యామ్, కుబోటా, లోవెల్, క్లాసిక్ యంత్రాలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం గ్యామ్‌మిషన్‌ను వినియోగిస్తున్నారు. కొత్త మిషన్ కొనాలంటే రూ.25లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రతీ మండలంలో సుమారుగా 150వరకు కోత మిషన్లు తిరుగుతున్నప్పటికీ కొరత ఏర్పడింది.

ఎకరానికి రూ.10 వేలు

కోత మిషన్‌తో ఎకరం పొలం కోయడానికి గంట నుంచి గంటన్నర సమయం పడుతోంది. రూ.5వేలకు పైగా ఖర్చవుతోంది. కానీ నేలకొరిగిన పంట కోయడానికి అదనంగా సమయం పడుతుందని రైతులు వాపోతున్నారు. కోత మిషన్‌కు గతేడాది గంటకు రూ.3 వేలు ఉండగా ప్రస్తుతం రూ.3,500 వరకు తీసుకుంటున్నారు.నేలవాలిన పంటను కోయాలంటే ఎకరానికి రూ.10వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కోత ఖర్చులే తడిసి మోపెడవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరి కోయడానికి ఇబ్బందులు పడుతున్నాం



వరి కోతమిషన్ల కొరత కారణంగా పంటలు కోయడానికి ఇబ్బందులు పడుతున్నాం. మిషన్ల కోసం పడిగాపులు తప్పడంలేదు. యంత్రాలు సకాలంలో రాకపోవడంతో కోతలు ఆలస్యంగా జరుగుతున్నందున చేనులోనే గింజ రాలిపోతుంది. దీంతో దిగుబడులపై ప్రభావం చూపుతోంది. పంట నూర్పిడికి ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడులు కూడా తగ్గుతున్నాయి. ఆరుగాలం శ్రమించి కష్టనష్టాలకోర్చి పంటలు సాగు చేస్తున్న తమకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి.

బిజిలి అశోక్, రైతు, నిడమనూరు.

ట్రాక్టర్ ట్రాలీ వినియోగంతో...

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్ ట్రాలీనీ కొంచెం టెక్నిక్‌ని ఉపయోగించి చైన్‌మిషన్ ట్రాన్స్‌పోర్ట్ ట్రాక్‌గా మలుస్తున్నారు మిర్యాలగూడకు చెందిన పలువురు ట్రాక్టర్ ట్రాలీ తయారీదారులు.. వరి కోత యంత్రాల కొరత వేధిస్తున్న సమయంలో వీరి ప్రయోగం రైతులకు ప్రయోజనకరంగా మారింది. సాధారణ ట్రాక్టర్ ట్రాలీకి రెండు స్టెయిర్ కేసులను అమర్చి చైన్‌మిషన్‌ను ట్రాలీలోకి చేరుకునేందుకు వీలుగా మలిచారు. నాలుగు వీల్స్‌ను అమర్చి మూడున్నర టన్నుల బరువును మోసేలా తయారుచేయడంతో డీసీఎం అవసరం లేకుండానే చైన్‌మిషన్లను పొలాల వద్దకు సులభంగా రవాణా చేస్తున్నారు. ఈ ట్రాలీలో ముందుభాగాన పెద్ద టూల్‌బాక్స్‌ను అమర్చడం ద్వారా అవసరమయ్యే సామాగ్రిని నిల్వ చేయడమే కాకుండా బాక్స్‌పైన చైన్‌మిషన్ కట్టర్‌బార్ నిలిపేందుకు అనువుగా మలిచారు. దీంతో ఖర్చు తగ్గడంతో రైతులు వీటినే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

పత్తి కొనుగోలు వెంటనే చేపట్టాలి



నీలంనగర్ వద్ద రోడ్డుపై పడుకుని రాస్తారోకో చేస్తున్న పత్తి రైతులు

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ నిబంధనలతో జిన్నింగ్ మిల్లులు కొనుగోళ్లు నిలిపివేశాయని, వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలం నీలంనగర్ సమీపంలోని కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై సోమవారం పత్తి రైతులు రోడ్డుపై పడుకుని రాస్తారోకో చేశారు. గంట పాటు జరిగిన ఆందోళనతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచి పోయాయి. సీసీఐ ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో బిల్లులో కఠిన నిబంధనలు అమలు చేయడాన్ని నిరసిస్తూ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పత్తి కొనుగోళ్లను సోమవారం నుంచి నిరవధికంగా నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రెండు కొనుగోలు కేంద్రాలకు తాళం వేశారు. సీసీఐ నిబంధనలను పునఃపరిశీలించి సమస్యలు పరిష్కరించే వరకు కొనుగోళ్లను నిలిపివేయాలంటూ విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ నిర్ణయంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ఆరంభంలో వర్షాభావం, తర్వాత భారీ వర్షాలతో పత్తి చేలు జాలు పట్టిపోయిందన్నారు. తెగుళ్లు, చీడపీడల బెడదతో ఉండడంతో దిగుబడి ఎకరానికి 10-12 క్వింటాళ్లకు గాను కేవలం ఐదారు క్వింటాళ్లు మాత్రమే వచ్చిందన్నారు. దిగుబడి తగ్గి ఆందోళన ఉన్న తమకు కొనుగోలుదారుల బంద్‌తో మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నాలుగు రోజులుగా పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామని వెంటనే ప్రభుత్వం పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాస్తారోకో చేస్తున్న రైతులపై ఓ కానిస్టేబుల్ పరుషపదజాలం వాడడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. వెంటనే ఇన్‌చార్జి ఎస్ఐ రాజు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి శాంతింపజేసే ప్రయత్నం చేయగా వారు వినలేదు. కానిస్టేబుల్‌పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలపడంతో రైతులు శాంతించి రాస్తారోకోను విరమించారు.

కొండమల్లేపల్లిలోనూ ఆందోళన

కొండమల్లేపల్లి : సీసీఐ నిబంధనలకు నిరసనగా జిన్నింగ్ మిల్ యజమానులు కొనుగోళ్లు నిలిపివేయడాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై పత్తి ట్రాక్టర్‌ను అడ్డంగా పెట్టి రైతులు రాస్తారోకో దిగారు. కొనుగోలు కేంద్రాల మూసివేతతో రోజుల తరబడి కేంద్రాల వద్దనే ఉంటుండడంతో ట్రాక్టర్లకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోయారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు రైతులు సర్దిచెప్పి ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో రైతులు కొర్ర స్వామి, మెగావత్ హరిలాల్, పగడాల బాలయ్య పాల్గొన్నారు.



చిన్నఅడిశర్లపల్లి వద్ద రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

రైతులను మోసం చేస్తే మిల్లులు సీజ్ చేస్తాం

మద్దతు ధర ఇవ్వాల్సిందే : నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి



నల్లగొండ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లర్లు ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320 ఇవ్వాల్సిందేనని, తక్కువకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తే మిల్లులను సీజ్ చేస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాకుండా మిల్లుకు సంబంధించిన అన్నిరకాల లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. ముఖ్యంగా మార్కెటింగ్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, పొల్యూషన్ లైసెన్స్, విద్యుత్ లైసెన్స్ వంటివి రద్దు చేస్తామని పేర్కొన్నారు. మద్దతు ధర రూ.2,320 కన్నా తక్కువ కాకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతులు రైస్‌మిల్లులకు వెళ్లకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంటలను తీసుకెళ్లి మద్దతు ధరతో పాటు, బోనస్‌ను పొందాలని విజ్ఞప్తి చేశారు.

ధాన్యం సేకరణలో అధికారులు చురుకైన పాత్ర పోషించాలి

ధాన్యం సేకరణలో వ్యవసాయ విస్తరణ అధికారులు చురుకైన పాత్ర పోషించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ధాన్యం సేకరణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ విస్తరణ అధికారులకు పలు సూచనలు చేశారు. కొనుగోళ్లను ప్రతి రోజూ పర్యవేక్షించాలని, పంటకు ప్రభుత్వ మద్దతు ధర అందేలా సహకరించాలని, నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, ధాన్యం సేకరణలో నిర్లక్ష్యంగా ఉండవద్దని హెచ్చరించారు. అనంతరం సన్న రకం ధాన్యం నిర్ధారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన క్వాలిఫయర్స్‌పై వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, వ్యవసాయ శాఖ సహాయసంచాలకులు పాల్గొన్నారు.

దళారుల మాటలకు
మోసపోవద్దు : ఎస్పీ

నల్లగొండ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో సూచించారు. మిర్యాలగూడ డివిజన్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశారన్నారు. సుమారు 110 రైస్‌మిల్లుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు, అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కొనుగోళ్ల విషయంలో మోసాలకు పాల్పడడం, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠినచర్యలు తప్పవన్నారు.

సన్నధాన్యమంతా మిర్యాలగూడకే!

(మొదటిపేజీ తరువాయి)

అనివార్యంగా ఈ రెండు జిల్లాల ధాన్యం మిర్యాలగూడ మిల్లులకే వస్తోంది. దీంతో వానాకాలం సన్నధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు ఆడిందే ఆటగా మారింది. నల్లగొండ జిల్లాలో ప్రధానంగా మిర్యాలగూడ డివిజన్‌లో ఉన్న 120కి పైగా మిల్లుల్లో అత్యాధునిక సాంకేతికత, మిల్లింగ్ సామర్థ్యం కలిగిన రైస్‌మిల్లులు 84 వరకు ఉన్నాయి. వాటిల్లో ఒక్క రోజులో ఒక్కో మిల్లులో కనీసం 1,500 మెట్రిక్‌టన్నుల ధాన్యం వరకు మిల్లింగ్ చేయవచ్చు. అదే సూర్యాపేట జిల్లాలో 100 వరకు మిల్లులు ఉండగా, 54 వరకు మాత్రమే పార్‌బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి. వాటికి నల్లగొండ జిల్లాలోని మిల్లుల టెక్నాలజీ, మిల్లింగ్ సామర్థ్యం లేకపోవడంతో అక్కడి సన్నధాన్యమంతా మిర్యాలగూడ మిల్లులకే వస్తోంది. అందుకే ఈ సీజన్‌లో మిర్యాలగూడ మిల్లుల వద్ద విపరీతమైన రద్దీ కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో మొత్తం 12.68లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా, మొత్తం 29.28లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తోందని అంచనా. అందులో సన్నధాన్యం 16.08లక్షల మెట్రిక్‌టన్నులు కాగా, 13.20లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం ఉంది. సన్నధాన్యం అత్యధికంగా సూర్యాపేట జిల్లా నుంచి 9లక్షల మెట్రిక్ టన్నులు, నల్లగొండ జిల్లా నుంచి 6.40లక్షల మెట్రిక్‌టన్నులు, యాదాద్రి జిల్లా నుంచి 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనావేశారు.

ఆయకట్టు ధాన్యమొస్తే ఎలా?

నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, సూర్యాపేట, భువనగిరి ప్రాంతాల నుంచి ఇప్పటికే మిర్యాలగూడ ప్రాంతానికి ధాన్యం ట్రాక్టర్ల రాక భారీగా ఉంది. ఆదివారం ఒక్కరోజే మూడు వేలకు పైగా ట్రాక్టర్లలో ధాన్యం వచ్చింది. ఇప్పుడే ధాన్యం ఎక్కువగా వస్తుండడంతో మిల్లుల వద్ద రద్దీ పెరిగి రైతులకు ధర తగ్గిస్తున్నారనే ఆందోళన కనిపిస్తుంటే, వచ్చేవారం నుంచి నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతాలైన సూర్యాపేట, నల్లగొండ జిల్లాల నుంచి ధాన్యం వస్తే కొనుగోళ్లలో ఇబ్బందులు మరింత పెరిగే పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన రైతుల్లో ఉంది.

నిరంతర పర్యవేక్షణతోనే..

సన్నధాన్యం విక్రయాల్లో రైతులకు అన్యాయం జరగకుండా మద్దతు ధర దక్కాలంటే మిల్‌పాయింట్ల వద్ద ధాన్యం కొనుగోళ్లపై అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయం, మార్కెటింగ్ శాఖాధికారులతో సంయుక్తంగా టోకెన్ విధానం అమలు చేయడంతోపాటు, మిల్లుల్లో రిజిస్టర్ల నిర్వహణ, రద్దీ లేకుండా ఎప్పటికప్పుడు కాంటాలు వేయడం, ధర కోత విధించకుండా చూసేందుకు పర్యవేక్షణ కమిటీలను తక్షణం అమలులోకి తేవాల్సి ఉంది. రెవెన్యూ, సివిల్‌సప్లయిస్, మార్కెటింగ్, పోలీసుల భాగస్వామ్యంతో ఉండే ఈ కమిటీలు ప్రతిరోజూ మిల్లులను తనిఖీచేసి కొనుగోళ్లను పర్యవేక్షించాలని రైతులు కోరుతున్నారు. ప్రధానంగా ఆదివారం, పండగ రోజులు, సెలవు దినాల్లో మిల్లుల్లో వర్కర్లు లేరని, గుమస్తాలు రాలేదని సాకులు చెబుతూ మిల్లర్లు ఉన్నట్లుండి కాంటాలు నిలిపివేస్తున్నారని, ముందస్తు సిండికేట్ ప్రకారం ఒక రోజు కొన్ని మిల్లుల్లో ధాన్యం కొనుగోలుచేసి, ఇంకో రోజు ఇంకొన్ని మిల్లుల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఆదివారం ఈ విషయం తేలిందని, దీన్ని పరిగణనలోకి తీసుకొని మిల్లుల సామర్థ్యం మేరకు టోకెన్లు కేటాయించిన ధాన్యానికి కాంటాలు వేసేలా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మిల్‌పాయింట్ల వద్ద ఇప్పటికే సుమారు రెండులక్షల మెట్రిక్‌టన్నుల వరకు ధాన్యం వచ్చి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేయాల్సిందే

- అతిక్రమిస్తే కేసులు నమోదు చేయిస్తాం
- ఫ్లోటింగ్‌ను తగ్గించేందుకు రైతులకు టోకెన్లు

మిర్యాలగూడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిల్లుల వద్దకు తెచ్చిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం మద్దతు ధరకన్నా తక్కువకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం శెట్టిపాలెం రోడ్డులోని కొన్ని మిల్లులను తనిఖీచేశారు. రైతుల వద్ద తక్కువకు ధాన్యం కొనుగోలు చేసిన మహర్షి మిల్లు యజమాన్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు సబ్మిట్ చేయాలని నోటీసులు జారీ చేశారు. అనంతరం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ, సివిల్‌సప్లయ్, మార్కెటింగ్ శాఖ అధికారులు రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నేతలతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఒకటి రెండు మండలాలు మినహాయిస్తే మిగతా మండలాల్లో 20 శాతం కోతలు మాత్రమే పూర్తయినట్లు అధికారులు ఇచ్చిన సమాచారం ద్వారా తెలుస్తోందన్నారు. ఇప్పుడే మిల్లుల వద్ద పరిస్థితి ఈ విధంగా వుంటే మున్ముందు మరిన్ని సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని బుధవారం నుంచి టోకెన్ విధానం అవలంభించనున్నట్లు తెలిపారు. మిల్లుల సామర్థ్యం మేరకు ఒక రోజు ముందుగానే ఏ మేరకు ధాన్యం తేవాలో రైతులకు టోకెన్లు పంపిణీ ద్వారా తెలియజేస్తామన్నారు. దీంతో ప్రతిరోజూ 3,000 ట్రాక్టర్ల వరకు మాత్రమే రైతులు ధాన్యాన్ని తీసుకవచ్చి ఇబ్బందులు లేకుండా విక్రయించేందుకు వీలుంటుందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు ముగ్గురు చొప్పున టీంలు ఏర్పడి ఫుడ్‌సేఫ్టీ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, ధాన్యం ఎగుమతులు, కొనుగోళ్ల రికార్డులను తనిఖీ చేయాలన్నారు. రికార్డులు నమోదు చేయని మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు, తహసీల్దార్లు హరిబాబు, కోటేశ్వరీ, రూరల్ సీఐ వీరబాబు, మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు గౌరు శ్రీనివాస్, బాబ్జి, కుశలయ్య పాల్గొన్నారు.



అధికారులు, మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

బుద్ధి ఉందా.. గాడిదలు కాస్తున్నారా?

డీటీసీఎస్‌పై సబ్‌కలెక్టర్ మండిపాటు

మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొంటుంటే చర్యలు తీసుకోకుండా ఏంపని చేస్తున్నావు, బుద్ధి ఉందా అంటూ సివిల్‌సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌పై సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నధాన్యాన్ని క్వింటా రూ.2,150లకే కొనుగోలు చేశారని ఫిర్యాదులు అందడంతో మిర్యాలగూడ పట్టణంలోని నల్లగొండ రోడ్డులోని మహర్షి రైస్‌మిల్లును ఆయన తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు రశీదును పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధర కంటే తక్కువ కొంటుంటే గాడిదలు కాస్తున్నావా అంటూ డీటీసీఎస్ జావిద్‌పై అసహనం వ్యక్తం చేశారు. మిల్లర్ల సమావేశంలో క్వింటా ధాన్యాన్ని రూ.2400కు తగ్గకుండా కొనుగోలు చేయాలని నిర్ణయించారన్నారు. కావాలనే మహర్షి మిల్లు యజమాన్యం కొనుగోలు నిలిపివేసి ధాన్యం ట్రాక్టర్లను బయట నిలబెట్టి తక్కువకు కొనుగోలు చేస్తోందన్నారు. మిల్లు యాజమాన్యం రిజిస్టర్ కూడా నిర్వహిస్తలేదన్నారు. మిల్లుల్లో సమస్య తలెత్తినా చర్యలు తప్పవని, అవసరమైతే క్రిమినల్ చర్యలకు వెనుకాడమన్నారు.

పాలనకు చెడ్డపేరు తెస్తే సహించం: డీఎస్పీ

ప్రభుత్వం విధించిన షరతుల మేరకు మిల్లర్లు నడుచుకోవాలని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి సహకరించాలన్నారు. కొర్రీలతో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. పాలనకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృత్యువాత

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రమణంపల్లి వెంకటయ్య, బొడ్డుపల్లి అంజికి చెందిన మూడు గేదెలు సోమవారం ఉదయం వ్యవసాయ పొలంలో మేత మేయడానికి వెళ్లాయి. గ్రామ శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు వెళ్లే విద్యుత్ జంపర్లు కట్ చేసి ఉన్నాయి. ఆ పొలం పక్కన రైతు వరి పొలం కోత మిషన్ ద్వారా కోయగా ఆ మిషన్‌కు ఒక జంపర్ తగిలి తెగిపోయింది. ఆ జంపర్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో అలాగే వదిలేశాడు. సోమవారం మధ్యాహ్నం మేత మేస్తుండగా గేదె మెడకు గుడె కట్టిఉండడంతో దానికి ఆ తెగిన వైర్ చుట్టుకుంది. ఆ గేదెతో పాటు విద్యుత్ వైర్ కూడా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకోగానే, ఆ వైర్‌కు విద్యుత్ సరఫరా అయి వైరుకు తగలడంతో ఒక్కసారిగా శబ్దం చేస్తూ గేదె మృతిచెందింది. అక్కడే ఉన్న మరో రెండు గేదెలు దాని వద్దకురాగానే దానికి ఆ తీగ తగిలి అవి కూడా మృతి చెందాయి. వీటి విలువ రూ.3.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుర్రంపోడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలోని ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఆవుల వెంకన్నయాదవ్ తమ సమీప బంధువు మృతిచెందడంతో అంత్యక్రియల కోసం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి రాత్రి 10గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి తాళం విరగొట్టి బీరువాను పగులగొట్టి దొంగలు రూ.1.92లక్షల నగదు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుడి ఫిర్యాలు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధు తెలిపారు. క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు.

దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్

కనగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో పోలీసులు సోమవారం ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... కనగల్ గ్రామానికి చెందిన ముద్దం నాగరాజు గత నెల ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతనికి చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసి నల్లగొండలోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. మరుసటి రోజు ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన వారికి ఇంటికి వేసిన తాళం తీసిఉంది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో దాచిన తులంన్నర బంగారు ఆభరణాలతో పాటు రూ.25 వేల నగదు కన్పించలేదు. దీంతో చోరీ జరిగిందని నిర్థారించుకొని అదేరోజు పోలీసులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కనగల్ గ్రామానికి చెందిన రాయల రామక్రిష్ణను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీ చేసిన సొత్తులోని తులంన్నర బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

రాజాపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పారుపల్లిలో సోమవారం జరిగింది. జనగామ జిల్లా నర్మెట్ట మండలం వెల్దండ గ్రామానికి చెందిన గుండెల్లి జహంగీర్‌రెడ్డి సోమవారం తన కారులో రాజాపేట మండలంలోని రేణికుంట గ్రామంలో ఉన్న తన చెల్లెలు ఇంటికి వచ్చాడు. చెల్లిలిని తీసుకొని తిరిగి వెళ్తున్న క్రమంలో మండలంలోని పారుపల్లి రెవెన్యూ పరిధిలో వాగు వద్ద కారులోంచి కాలుతున్న వాసన రావడంతో కారును నిలిపివేసి పరిశీలించారు. కారు నుంచి పొగలు వస్తూ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాకపోగా కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ఉన్న ముగ్గురు సురక్షితంగా బయటపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఫర్నిచర్ దుకాణంలో అగ్నిప్రమాదం

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని శ్రీ సాయి మెటల్ స్టోర్స్ స్టీలు, ఫర్నిచర్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో సోమవారం మంటలు చెలరేగాయి. గమనించిన దుకాణ యజమానితోపాటు పక్కన ఉన్న దుకాణదారులు నీళ్లతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. దుకాణంలో ఉన్న ఫర్నీచర్ వస్తువులను బయటకు తెచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక పెట్రోల్ బంకు వద్ద నుంచి అగ్నిమాపక కిట్లను తెచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనలో దుకాణంలోని పరుపులు, మంచాలు, బీరువాలు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. సుమారు రూ.4లక్షల మేరకు నష్టం వాటిల్లిందని బాధితుడు జంగయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. అదేవిధంగా పట్టణ పరిధిలోని రేవణపల్లిలో జ్యూయెలరీ దుకాణంలో సిలిండర్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణం గ్లాసు అద్దాలు పగిలిపోగా, దుకాణంలో ఉన్న కొన్ని వస్తువులు దగ్ధమయ్యాయి. ఎవరికీ గాయాలు కాలేదు. దుకాణదారుడు నిఖిల్ చారి జ్యూయెలరీ పనిచేస్తుండగా గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగడంతో సిలిండర్ పైపును బయటకు వేయడంతో మంటలు ఆరిపోయాయి.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

వలిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా మండలకేంద్రానికి చెందిన పెంటయ్యకు 25 సంవత్సరాల క్రితం కనకమ్మ(42)తో రెండో వివాహం జరిగింది. మొదట్లో వీరి కాపురం సజావుగానే సాగింది. ఈ మధ్య భర్త పెంటయ్య మద్యానికి బానిసై భార్యను సరిగ్గా చూసుకోవడం లేదు. ఆమె సోదరుడు యాదగిరి సోమవారం చెల్లెలి ఇంటికి వెళ్లి చూడగా కనకమ్మ విగితజీవిగా పడి ఉంది. మెడపై నల్లటి గుర్తు ఉంది. బావ పెంటయ్య మొదటి భార్య కూతురు లలితపై అనుమానం ఉందని యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చనిపోతూ.. ప్రాణదానం


భాస్కర్(ఫైల్)

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురైన వ్యక్తి నుంచి జీవన్‌దాన్ సభ్యులు అవయవాలు సేకరించారు. నల్లగొండ జిల్లా చిట్యాల విద్యానగర్‌కు చెందిన సంగిశెట్టి భాస్కర్(47) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 7న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స అందించిన వైద్యులు ఈ నెల 9న బ్రెయిన్‌డెడ్‌గా నిర్థారించారు. జీవన్‌దాన్ సభ్యులు భాస్కర్ సతీమణి రాణిని కలిసి అవయవదానం గురించి వివరించి, అవయవ దానానికి ఒప్పించారు. బ్రెయిన్‌డెడ్‌కు గురైన వ్యక్తినుంచి రెండు కిడ్నీలు, లివర్ సేకరించారు.

ఉల్లి ఘాటు.. వండాలంటే పోటు

● అమాంతం పెరిగిన ఉల్లిగడ్డ ధర ● రిటైల్‌గా కిలో రూ.70 నుంచి రూ.80పైనే ● ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు 220లారీలకు పైగా విక్రయం



నల్లగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉల్లి ధరలు రోజురోజుకు మండి పోతున్నాయి. ధరలు అమాంతంగా పెరిగిపోతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిన్న, మొన్నటి వరకు హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.40 ఉండగా ప్రస్తుతం ఏకంగా హోల్‌సేల్ మార్కెట్‌లోనే రూ.55 నుంచి రూ.60 వరకు పెరిగింది. దీంతో రిటైల్‌గా రూ.70 నుంచి రూ.80 వరకు కూడా విక్రయిస్తుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. ధరల నియంత్రణ లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉల్లిగడ్డ ధర పెరగడంతో ప్రజలు ఉల్లిగడ్డ కొనుగోలు చేయాలంటే భయపడుతున్నారు. ఉదాహరణకు నల్లగొండ పట్టణంలోనే రోజుకు రెండు లారీల ఉల్లిగడ్డ విక్రయాలు జరుగుతాయి. ఒక్క లారీలో పది టన్నుల ఉల్లిగడ్డ ఉంటుంది. ఈ విధంగా నల్లగొండ జిల్లా మొత్తం 100 లారీలకు పైగా విక్రయిస్తుండగా, యాదాద్రిభువనగిరి జిల్లాలో 50లారీలకు పైగా ఉల్లిగడ్డ విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం. సూర్యాపేట జిల్లాలో 70లారీల వరకు ఉల్లిగడ్డ విక్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో కిలోకు రూ.10నుంచి రూ.15ఉండగా ప్రస్తుతం రూ.70నుంచి రూ.80 వరకు ధర పలుకుతోంది. నాణ్యమైన ఉల్లిగడ్డకు అదనంగా కూడా ధర చెల్లించి కొనుగోలు చేయాల్సివస్తోందని ప్రజలు వాపోతున్నారు.

ఒక్కో బస్తాలో 50 నుంచి 52 కిలోల ఉల్లిగడ్డ

ఒక్కో బస్తాలో 50నుంచి 52కిలోల వరకు ఉల్లిగడ్డలు ఉంటాయి. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు దిగుమతి అవుతుంటాయి. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో గుజరాత్ రాష్ట్రం నుంచి ఉల్లిగడ్డలు మూడు జిల్లాలకు ఎగుమతి చేసి విక్రయిస్తుంటారు. అదేవిధంగా మరో మూడు నెలల పాటు కర్నాటక రాష్ట్రం నుంచి తెచ్చి విక్రయిస్తుంటారు. మూడు మాసాల చొప్పున కొన్ని కొన్ని ప్రాంతాల నుంచి అక్కడ పంటలను బట్టి దిగుమతి చేస్తుంటారు. దీనితోనే రేట్లల్లో వ్యత్యాసం ఉంటుంది. కొన్నిసార్లు అక్కడ ధరలను బట్టి, దిగుబడులను బట్టి దిగుమతి చేసుకుంటున్నారు. ఉల్లిని చాలాచోట్ల బ్లాక్ చేయడం వల్ల ధరలు పెరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఇంట్లో ఉల్లిగడ్డతో వంటలు వండుకోలేని పరిస్థితులు ఉన్నాయి. చాలీచాలని జీతాలకు తోడు పెరిగిన ధరలు భారంగా మారాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉల్లిధర రెట్టింపు కావడంతో తమ కుటుంబ బడ్జెట్‌ను దెబ్బ తీస్తోందని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పెరుగుతుండటంతో అమ్మకాలపై ప్రభావం కన్పిస్తోందని, విక్రయాలు తగ్గాయని వ్యాపారులు వాపోతున్నారు. సామాన్య ప్రజలు ఉల్లిగడ్డతో వంటలు వండుకోలేని పరిస్థితులు ఉన్నాయి.

పెరిగిన ఉల్లిగడ్డ ధరను తగ్గించాలి



ఉల్లిగడ్డ ధర పెరగడంతో వంటల్లో వాడాలంటే ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. పేద ప్రజలకు పెరిగిన ధరల వల్ల ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం వెంటనే ఉల్లిగడ్డను ధరను తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. అధికారులు కూడా ధరలను తగ్గించడం కోసం ఏర్పాటు చేయాలి. రైతు బజారులో తక్కువ ధరకు ఉల్లిగడ్డలు అమ్మాలి. కూలి పనులు చేసుకునే వారికి పెరిగిన ధరల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

● అంజమ్మ, దండెంపల్లి, నల్లగొండ మండలం, నల్లగొండ జిల్లా.

ప్రతి బస్తాలో ఆరు కిలోలకు పైగా దెబ్బతిన్న ఉల్లిగడ్డలే

హోల్‌సేల్‌గా ఇతర రాష్ట్రాల నుంచి బడా వ్యాపారులు ఉల్లిగడ్డ లోడ్‌లను తెప్పించి ఆ తర్వాత ఆయా పట్టణాలు, మండలాలు, గ్రామాలకు కొంత మేరకు హోల్‌సేల్‌తో పాటు రిటైల్ రేట్లకు చేరవేస్తుంటారు. ఒక బస్తాలో సుమారు రూ.50 నుంచి రూ.52కిలోలు ఉంటే అందులో ఆరు కిలోలకు పైగా మెత్తబడిన, నీరుతో కూడిన ఉల్లిగడ్డలతో పాటు మురిగిపోయి నల్లబడిన ఉల్లిగడ్డలు ఉంటుడటంతో రిటైల్ వ్యాపారులు ఆరు కిలోల నష్టాన్ని కూడా వినియోగదారులపై వేయాల్సిన పరిస్థితి ఉందని సమాచారం. కర్నాటక, గుజరాత్, ఏపీలోని కర్నూల్ వంటి సుదూర ప్రాంతాల నుంచి ఉల్లిగడ్డను తీసుకవచ్చి విక్రయిస్తున్న నేపథ్యంలో చాలా వరకు బస్తాల్లో దెబ్బతిని ఉంటుందని వ్యాపారులు సైతం పేర్కొంటున్నారు. ఉల్లిసాగులో ఎరువుల వాడకం పెరగడం వల్ల కూడా లారీల్లో జిల్లాలకు చేరే సరికి కొన్ని సార్లు బస్తాలకు, బస్తాలే దెబ్బతింటుందని, ఆ నష్టం కూడా వ్యాపారులపై పడుతుండటంతో హోల్‌సేల్ వ్యాపారులు రిటైల్ వ్యాపారులను బాదుతుండగా, రిటైల్ వ్యాపారులు వినియోగదారులను బాదుతుండటంతో సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు అమ్మో ఉల్లిగడ్డ అనే పరిస్థితి ఏర్పడిందని చెప్పవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లిగడ్డ ధరల నియంత్రణపై దృష్టి సారించకపోతే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తప్పదని స్పష్టమవుతోంది. రోజువారీ కూలి పనులు, చిన్న చిన్న పనులు చేసుకుని జీవిస్తున్న వారు పెరిగిన ఉల్లిగడ్డ ధరలు చూసి కొనుగోలు చేయాలంటే అయోమయానికి గురవుతున్నారు.

చికెన్ ధరలు




జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.10
టీఎంసీలు	305.5646
ఎడమకాల్వకు నీటి విడుదల	3,490
కుడికాల్వకు	10,120
విద్యుత్ కేంద్రం ద్వారా	16,849
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,852 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	33,259 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు



పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.52 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	6వేల క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	290క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.89 అడుగులు
టీఎంసీలు	4.17
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	429.27 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	369.47 క్యూసెక్కులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


డీసీఎం డ్రైవర్ మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

ఆలేరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, యదాద్రి భువనగిరి జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. డీసీఎం డివైడర్‌ను ఢీ కొట్టడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన యాద్రాది జిల్లా ఆలేరులోని బహదూర్‌పేట సమీపంలో ఉన్న ఈదులవాగు వంతెనపై సోమవారం జరిగింది, ఎస్ఐ రజినీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన వెంకటసీతారాం(42) డీసీఎం డ్రైవర్. వరంగల్‌కు వెళ్లి సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా డీసీఎం డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వంతెనపై నుంచి వాగులో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

చింతపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామ శివారులో గల రాజ్యానాయక్‌తండా సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్యానాయక్ తండా గ్రామం నుంచి గుర్తుతెలియని మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా సాగర్ నుంచి హైదరాబాద్ వైపునకు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నసర్లపల్లి పంచాయతీ కార్యదర్శి బైరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా..

తిప్పర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లెపల్లివారి గూడెం గ్రామానికి చెందిన ఓర్సు రాములమ్మ(65) సోమవారం రామలింగాలగూడేనికి చెందిన ఓ రైతు చేనులో పత్తి ఏరేందుకు వెళ్లింది. పనులు ముగించుకొని సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటికి తిరుగు ప్రయాణమైంది. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినది. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతురాలి స్వగ్రామం నల్లగొండ సమీపంలోని పానగల్లు కాగా పదేళ్లుగా తన తల్లిగారి గ్రామమైన మల్లెపల్లివారి గూడెంలోనే నివాసం ఉంటుంది. రాములమ్మకు కుమారుడు ఉన్నట్లు సమాచారం.

చికిత్సపొందుతూ ..

ఆలేరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మండలం శారాజీపేట గ్రామానికి చెందిన ఆడెపు అంజయ్య (48) ఈ నెల 4న తన బావి వద్ద వరికోత యంత్రంతో కోయిస్తుండగా ప్రమాదవశాత్తు ఆ యంత్రం వెనుకకు వస్తున్న క్రమంలో దాని కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీ, కుమారులు కరుణాకర్, వంశీ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆలేరులోని పీహెచ్‌సీకి తరలించామన్నారు.

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన సీత మధు రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంతో ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మధు పాల వ్యాపారి కాగా, భార్య గాయత్రి, రెండేళ్ల బాలిక, ఏడాది వయసున్న బాలుడు ఉన్నాడు. మధు పైనే ఆధారపడిన కుటుంబం ఆధారపడి జీవిస్తోంది. మధు మృతితో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టలో పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తి కుళ్లిపోయిన మృత దేహం లభ్యమైంది. స్థానిక సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోశాల రింగు రోడ్డు ప్రాంతంలోని చెట్ల పొదల్లో సుమారు 15, 20 రోజుల మధ్య మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహంపై చొక్క, నల్లటి ప్యాంటు, కుడిచేతికి కడెం ఉంది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో క్లూస్‌టీం బృందం పరిశీలించింది. అతడి పక్కనే ఉన్న డైరీ పరిశీలించగా స్థానిక తాపీ మేస్త్రీల ఫోన్ నంబర్లు ఉన్నట్లు సమాచారం తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తనయుడి చేతిలో తండ్రి హతం


రామచంద్రం (ఫైల్)

మునుగోడురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇప్పించిన డబ్బులు ఇవ్వాలని అడిగిన తండ్రిని కుమారుడు హత్య చేశాడు. సోమవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం చొల్లేడు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. చొల్లేడు గ్రామానికి చెందిన కట్కూరి రామచంద్రం (62)కు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రామచంద్ర భార్య ధనమ్మ కుటుంబ కలహాల కారణంగా 14 ఏళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. నలుగురు కుమారులు నర్సింహ, లింగస్వామి, మహేష్, నిరోష్, కుమార్తెకు వివాహాలయ్యాయి. దీంతో ఆయన తనకున్న ఎకరంన్నర వ్యవసాయం భూమిలో సాగు చేసుకుంటూ, శుభ కార్యాలకు వంట మనిషిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండో కుమారుడు లింగస్వామి మునుగోడులో నివాసం ఉంటుండగా, మిగిలిన ముగ్గురు కుమారులు ఒకేచోట నివాసం ఉంటున్నారు. మొదటి కుమారుడు నర్సింహ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నర్సింహకు రేణుకతో 18 ఏళ్ల క్రితం వివాహంకాగా, వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఆమె పుట్టింటికి వెళ్లింది. అనంతరం నర్సింహ చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన మేనమామ కుమార్తె సైదమ్మను రెండో వివాహం చేసుకోగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత మొదటి భార్య రేణుక నర్సింహ వద్దకు వచ్చింది. దీంతో ఇరువురు భార్యలతో నర్సింహ కలిసి ఉండేవాడు. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలతో 12 సంవత్సరాల క్రితం సైదమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో సైదమ్మ తండ్రి ఫిర్యాదు మేరకు రామచంద్రంతో పాటు, నర్సింహలపై కేసు నమోదు చేయడంతో జైలుకు వెళ్లి వచ్చారు. ఇరువురిపై మోపిన కేసు కోర్టులో ఇటీవల కొట్టివేశారు. దీంతో చొల్లేడు గ్రామంలోనే కలిసి జీవనం సాగిస్తున్నారు. కోర్టు కేసు ఖర్చుల విషయంలో రామచంద్రం కుమారుడు నర్సింహకు రూ.లక్ష అప్పు తెచ్చి ఇచ్చాడు. అప్పు తీర్చాలని కుమారుడిని పలుమార్లు అడిగాడు. ఈ అంశంపై రెండు రోజులుగా ఇంట్లో వారిద్దరికి వివాదం జరుగుతోంది. సోమవారం సాయంత్రం తండ్రి రామచంద్రం అప్పు విషయాన్ని తన ఇంట్లోనే కుమారుడు నర్సింహ వద్ద ప్రస్తావించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న నర్సింహ కోపోద్రిక్తుడై ఇంట్లో ఉన్న గొడ్డలితో దాడిచేయటంతో తండ్రి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చండూరు సీఐ వెంకటయ్య, మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ తనిఖీ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కుమారుడు నర్సింహ మునుగోడు పోలీస్‌స్టేషన్లో లొంగిపోయినట్లు సమాచారం. ఘటనపై ఫిర్యాదు అందలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లుఎస్ఐ తెలిపారు.

హరిహరులకు విశేష పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం కొండకింద 691 జంటలు వ్రత పూజలు, మహిళా భక్తులు సోమవారం కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కొండపై హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,92,444 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

డిండి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలికల గురుకుల పాఠశాలల 10వ జోనల్ క్రీడలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడంతోపాటు క్రీడారంగ అభివృద్ధికి విధి, విధానాలను రూపొందించనున్నట్లు తెలిపారు. మండలాల్లో మినీ స్టేడియాలను నిర్మించేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. చిన్న దేశాలు ఒలంపిక్స్ క్రీడల్లో పతకాలు సాధించినప్పటికీ 130 కోట్ల జనాభా ఉన్న భారతదేశం ఒలింపిక్స్‌లో పతకాలు సాధించక పోవడం బాధాకరమన్నారు. చదువుకున్న వారిలో నైపుణ్యాలను పెంచేందుకు యునివర్సిటీని ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకొని మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యాభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 11వేల ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసిందని తెలిపారు. వసతిగృహలలోని విద్యార్థులకు 40శాతం కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడలలో గెలుపొటములు సహజమన్నారు. ఓటమిని క్రీడా స్పూర్తితో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, జమున మాధవరెడ్డి, ఎంపీడీవో వెంకన్న, డి.వెంకటేశ్వరరావు, ఎస్.రాజేష్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, గుర్రం రాములు, రాంకిరణ్, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, నూకం వెంకటేష్, మేకల కాశయ్య, శ్రీను, పోలం లక్ష్మణ్, బూషిపాక వెంకటయ్య, గోవర్ధన్‌రావు, ఎఫ్‌డీవో మారయ్య, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, యాసని హనుమంతురెడ్డి, ఎంఈవో గోప్యానాయక్, ప్రిన్సిపల్ శిరీష, అర్జున్‌ప్రసాద్, లక్‌పతినాయక్, కొర్ర రాంసింగ్, శైలేజ్, గడ్డమీది సాయి, విజేందర్‌రెడ్డి, కిన్నెర హరికృష్ణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

రాజాపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యాలయ సంయుక్త కార్యదర్శి చక్రునాయక్ కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో నాలుగు రోజుల పాటు నిర్వహించే 10వ జోనల్ స్థాయి పోటీలను సోమవారం ప్రారంభించారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందేందుకు క్రీడాలు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. జీవితంలో గెలుపు ఓటములు సహజమని రేపటి విజయానికి తొలిమెట్టు అవుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20ప్రాంతాల్లో క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 20,485 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి విద్యారాణి, డీసీవో జగదీశ్వర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, క్రీడాల సమన్వయ కర్త శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ రాజు, పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

యాసంగి సాగుకు సన్నాహాలు

5వ పేజీ తరువాయి: రెండు క్వింటాళ్ల పప్పులు, 28క్వింటాళ్ల నూనె గింజల విత్తనాల స్టాక్‌ను రైతులకు అందుబాటలో ఉంచేందుకు వ్యవసాయశాఖ నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 57,816మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేసింది. వీటిలో యూరియా 25,282 మెట్రిక్ టన్నులు, డీఏపీ 10,419 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,167 మెట్రిక్ టన్నులు, కాంప్లె ఎరువులు 16,670 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1,278 మెట్రిక్ టన్నుల వరకు రైతులకు అందుబాటులో ఉంచనుంది.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: బీజేపీ

మోత్కూరు, అడ్డగూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడి యం రామచంద్రయ్య కోరారు. సోమవారం మోత్కూరులో నిర్వహించిన సభ్యత్వ నమో దు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందాలంటే ప్రతి బూత్‌లో ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పించాలన్నారు. పోచం సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూర్యాపేట జిల్లా అధికార ప్రతినిధి దీనదయాల్, నియోజకవర్గ కోకన్వీనర్ కూరాకుల వెంకన్న పాల్గొన్నారు.

● అడ్డగూడూరులో బీజేపీ మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ నాయకుడు కడియం రామచంద్రయ్య మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నాయకులు కూరకుల వెంకటేశ్వర్లు, మేడబోయిన యాదగిరి, మండలాధ్యక్షుడు ననుబోతు సైదులు, దీన్ దీయాల్, నరసింహ్మగౌడ్, లింగాల శ్యాంసుందర్ రెడ్డి, సోమిరెడ్డి రెడ్డి నర్సిరెడ్డి, మేకల ఇమ్మానియేలు ఉన్నారు.

మత్స్యగిరిపై వైభవంగా ధ్వజారోహణం



గరుడ ముద్ద ఎగురవేస్తున్న అర్చకుడు, మాఢవీధుల్లో స్వామిని ఊరేగిస్తున్న అర్చకులు

వలిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి గుట్టపైన స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. గరుడ ధ్వజ ప్రతిష్ట, పల్లకి ధ్వజారోహణం, బలిప్రదానం, దేవతాహ్వనం, హోమక్రతువులు, భేరీ పూజా సోమవారం ఈ బ్రహ్మోత్సవాలకు నలుమూలల నుంచి ప్రజలు తరలిరాగా మత్స్యగిరికొండపై భక్తుల కోలాహలంతో బ్రహ్మోత్సవ సందడి నెలకొంది. లోక కల్యాణం విశ్వశాంతి కోసం ముక్కోటి దేవతలకు నిలయంగా మత్స్యాద్రి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. యాగశాలకు ద్వారతోరణార్చన జరిపి, ఆగమ శాస్త్రరీతిలో బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు ధ్వజారోహణ ఘట్టం జరిగింది. ముక్కోటి దేవతలను ఆహ్వానించడానికి శ్రీ మహావిష్ణువు వాహనమైన గరుడ్మంతుడిని ఆహ్వానించడానికి ధ్వజారోహణ తంతును అర్చకులు జరిపారు. స్వామివారి గర్భాలయం ముందు గరుత్మంతుడి చిత్రపటం వేసి ముగ్ధమనోహరంగా, శాస్త్ర బద్ధంగా అలంకరించారు. వేదమంత్రాలతో దేవతలను కొలిచి గరుత్మంతుడి పటాన్ని ధ్వజపతాకంపై చిత్రీకరించారు. గరుడ పతాకాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేశారు. ఈ కార్యక్రమం రుత్వికులు, వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణ, నాదస్వర సప్తరాగాల నడుమ సాగింది. ఈ నేపథ్యంలో గరుడుడునిని ఆహ్వానించడానికి గరుడ ముద్దను ఎగురవేశారు. ఈ గరుడ ప్రసాదం స్వీకరిస్తే సౌభాగ్యం, సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

పల్లకి సేవ

స్వయంభూ నారసింహుడి స్వామి ప్రధాన గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను ఆల యం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామివారిని అధిష్ఠింపజేసి, స్వామిని భుజాలపైన మోస్తూ తరలించారు. హరినామ స్తోత్రాలు పటిస్తూ స్వామివారి కొలనుచుట్టూ ప్రదక్షిణలు చేసి కల్యాణ వేదిక వద్దకు తరలించారు. పల్లకి సేవ నేత్రానందంగా సాగింది.

భేరీ పూజ

మత్స్యగిరి బ్రహ్మోత్సవాలకు అష్టదిక్పాలకులను ఆహ్వానించడానికి సోమవారం రాత్రి భేరీ పూజా, దేవతాహ్వన కార్యక్రమాలు జరిగాయి. సప్త స్వరాలు, ఇష్ట వాయిద్యాలతో దిక్పాలకులను ఆహ్వానించారు. శబ్ద బ్రహ్మం, మూలమంత్ర జపంతో ప్రధాన వాయిద్య భేరీని మోగించి కంకణధారణ చేయడం ఉత్సవ ప్రత్యేకత. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హోమం

శ్రీ లక్ష్మీనారసింహుడి ఉత్సవ అతిధులుగా 33 కోట్ల మంది దేవతలను ఆహ్వానించి వారిని పంచసూక్తాలతో సంతృప్తి పరిచే హవన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. క్షేత్ర వైభవం ఇనుమడింపజేస్తూ లక్ష్మీనారసింహుడి మూలమంత్ర జప పారాయణం చేశారు. కార్యక్రమంలో దేవాలయ ఈవో మోహన్‌బాబు, రుత్వీకులు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మత్స్యగిరి దేవస్థానం నూతన చైర్మన్‌గా నరేష్‌రెడ్డి



నూతన పాలక మండలి

వలిగొండ మండలంలోని వెంకటపురం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొమ్మరెడ్డి నరేష్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం మత్స్యగిరి గుట్టపైన నూతన పాలక మండలి ధర్మకర్త దేవాదాయ ధర్మాదాయశాఖ భువనగిరి డివిజన్ పరిశీలకులు వెంకటలక్ష్మీ ప్రమాణస్వీకారం చేయించారు. ధర్మకర్తలుగా కొడితల కరుణాకర్, అరూరు వెంకటేష్, రేకల ప్రభాకర్, మైళ్ల అంజయ్య, బండి రవికుమార్, గుండు జగన్‌మోహన్‌రెడ్డి, అంబాల ఉషయ్య, ఈతప రాములు, జక్కుల కేతమ్మ, మైసోళ్ల వెంకటేషం, కొమిరే బాలేశ్వర్, కందుల శ్రీను, గజ్జెల అమరేందర్, ఎక్స్ అఫీషియల్ సభ్యులు ప్రతాపురం శ్రీనివాస్‌చార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి స్వలాది మోహన్‌బాబు, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, జనార్ధన్‌రెడ్డి నాయకులు అనంతరెడ్డి, రామ్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, వెంకటపాపిరెడ్డి, రవి, సత్తిరెడ్డి, ఉపేందర్, లింగయ్య, కొత్త వెంకటేశం, రాములు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు 18

భువనగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్ష ఫీజును ఈనెల 18వరకు చెల్లించాలని డీఈవో కే.సత్యనారాయణ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ వి ద్యార్థులు, మూడు సబ్జెక్టులకు పైబడిన పరీక్ష లు రాసే సప్లమెంటరీ విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టుల లోపు సప్లమెంటరీ రాసే విద్యార్థులు రూ.110 గడువు లోపు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు 2వరకు, రూ.500 అపరాధ రుసుముతో 21 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. గడువులోపు చెల్లించాలని విద్యార్థులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రధాన రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడు తున్న విద్యుత్‌లైన్ల పనులతో మంగళవారం స్థానిక హైదరాబాద్ చౌరస్తా నుంచి బొమ్మా యిపల్లి అండర్ పాస్ బ్రిడ్జి వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ సాయికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంట ల వరకు ఆ రహదారి ఇరువైపులా బస్తీలు, కాలనీలు హౌసింగ్‌బోర్డ్ కాలనీ, వైఎస్సార్ గార్డెన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరగదని, వినియోగదారులు సహకరిచాలని ఆయన కోరారు.

డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా మధుకృష్ణ

వలిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా పల్లె మధుకృష్ణ, కార్యదర్శిగా గడ్డం వెంకటేష్ ఎన్నికయ్యారు. మండలం కేంద్రంలో జరిగిన జిల్లా మహాసభలో వారు ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా సలీం, భువనగిరి గణేష్, ఉప్పలపెల్లి బాలకృష్ణ, ఖయ్యూం, సహాయ కార్యదర్శులుగా కవిడే సురేష్, దయ్యాల మల్లేషతో పాటు 21 మందిని ఎన్నుకున్నారు.

మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ కమిటీ

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): సంస్థాన్‌నారాయణపురం మండల మాదిగ జర్నలిస్టు ఫోరం సమావేశం సోమవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా చింతకింది సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సిరిపంగి బాలరాజు, ఉపాధ్యక్షుడిగా ఉప్పలపల్లి బాలు, గౌరవాధ్యక్షుడిగా వలిగొండ యాదయ్య, సహాయ కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా కురుమతి రమేష్ ఎన్నికయ్యారు.

'కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి'

భువనగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరెన్సీపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరుశురాం అన్నారు. సోమవారం భువనగిరిలో జరిగిన సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే డిమాండ్‌తో డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ధర్నా పోస్టర్ విడుదల చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్నారం గ్రామంలో సీతారామాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం శంకుస్థాపన చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో భూమి పూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఎసీఎస్ చైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి, మాజీ ఎంపీపీ కక్కిరేణి ఎల్లమ్మ, విజయ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, గుత్తా నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంతరావు, గుడి పునర్నిర్మాత నల్ల భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఎనుగు దామోదర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సుధాకర్, కొండూరు శంకర్, జగదీష్, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వొద్దు



నిరాహారదీక్ష చేపట్టిన పద్మశాలి సంఘం నాయకులు

రామన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట ఏర్పాటు చేయబోయే సిమెంట్ ఫ్యాక్టరీకి ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దని అఖిలపక్ష నాయకులు, సిరిపురం గ్రామ పద్మశాలి సంఘం నాయకులు కోరారు. సోమవారం మండలలంలోని సిరిపురం గ్రామం లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కో-కన్వీనర్ ఎండీ రేహాన్, అఖిలపక్ష నాయకులు రాపోలు నర్సింహ, మేక అశోక్‌రెడ్డి, వెంకటేష్, మీర్జాఫజల్‌బేగ్, లక్ష్మీనర్సు, శ్రీనివాస్, యాదగిరి, కునూరు ముత్తయ్య, అంబటి సురేందర్‌రెడ్డి, రాపోలు స్వామి, రాపోలు నరేష్, పున్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

కులగణనతో అన్ని వర్గాల అభివృద్ధి

భువనగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా చేపట్టిన కులగణన ఆధారంగా ప్రభుత్వం రూపొందించే పథకాలతో అన్ని వర్గాల సంపూర్ణంగా అభివృద్ధి చెందుతాయని మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. సోమవారం భువనగిరిలోని 22వ వార్డులో ఆయన సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లు అడిగే వివరాలను అందరూ చెప్పాలని అన్నారు. యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పడిగెల ప్రదీప్, భూషపాక వెంకటేష్, గంగారం రమేష్, స్వామి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జంగమ్మ

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యమని భారత మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ అన్నారు. సోమవారం గుట్ట సీపీఐ కార్యాలయంలో పట్టణ మహిళా సమాఖ్య సమావేశం ఆరె పుష్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు గడిచినప్పటికీ దేశంలో మహిళలకు దక్కాల్సి గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ అరకొర సంక్షేమ పథకాలను మహిళలకు ప్రవేశపెట్టి ప్రజాస్వామ్యవ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నర్సమ్మ, రాగుల విజయలక్ష్మీ, పద్మ ఉన్నారు.

త్రిఫ్ట్ డబ్బులను ఖాతాల్లో వేయాలి

ఆలేరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకిచ్చిన డబ్బులను తమ తమ ఖాతాల్లో జమ చేయకుండా బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ చేనేత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాశికంటి శ్రీనివాస్, బచ్చు రాజులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి త్రిఫ్ట్ పథకం ద్వారా ప్రభుత్వం చేనేత కార్మికులకు ఆర్థిక సాయం అందజేసిందని అట్టి చెక్కులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తమకు అందజేశారన్నారు. ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ నిర్లక్ష్యంతో 60 రోజులుగా జాప్యం చేయడంతో ఆ డబ్బులు తమ ఖాతాల్లోకి జమ కాకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు.

అబుల్‌కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకం



భువనగిరిలో విద్యా సామాగ్రి పంపిణీ చేస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు, మోత్కూరులో జేజేసీలో అబ్దుల్ కలామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభజస్టీస్

భువనగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానంతర భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయమని పలువురు అన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. దేశ విద్యారంగాన్ని తీర్చిదిద్దారని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. భువనగిరిలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర సమరయోధుడిగా, విద్యాశాఖ మంత్రిగా దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు, కృషి చిరస్మరణీయమని అన్నారు. విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు తదితర విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కేర వెంకటేష్, నాయకులు తంగెళ్ళపల్లి రవికుమార్, బర్రె జహంగీర్, ఎండీ అవేజ్‌చెస్టి, ఎండీ మజార్, ఎండీ సలావుద్దీన్, పడిగల ప్రదీప్, వెంకటనర్సింగనాయక్, ఎండీ ఆబేద్‌అలీ, ఎండీ జలీల్, ఎండీ హమీద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జలీల్‌పుర ఖాదిం, జామియా ఇస్లామియా అరేబియా పాఠశాలలో నిర్వహించిన జయంతిలో ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్‌చౌదరి, కాజం అహ్మద్, రహీముద్దీన్ పాల్గొన్నారు.

మోత్కూరు : మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టీస్ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎ్‌సఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మౌలానా అబుల్ కలాం అజాత్ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకెళ్లాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల అన్నారు. ఎన్ఎస్ఎస్ మొదటి విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్ రాంబాబు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఎస్ఎస్ఎస్ యూనిట్ 1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ బి.సురేష్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ వి.జ్యోతి, అధ్యాపకులు తులసి, రాజేశ్వరమ్మ, మంజుల, సంతోష్, వెంకటేశం, శివశంకర్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైతన్యమహేందర్‌రెడ్డి

తుర్కపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):రైతులు పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించొద్దని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యమహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో పీఎసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డితో కలిసి ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఎసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, సిబ్బంది రమేశ్, జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జడ్పీ సీఈవో

మోటకొండూరు : మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగొలు కేంద్రాన్ని జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిరా, ఎంపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాక్సినేషన్ చేయించాలి

అడ్డగూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు వ్యాక్సినేషన్‌ను 100శాతం పూర్తి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కే.రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తదనంతరం ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి మండల వైద్యాధికారి ప్రవీణ్ కూమార్ ను ఓపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల వ్యాక్సినేషన్‌పై ప్రజలకు స్పష్టమైన సమాచారాన్ని అందించాలన్నారు. వ్యాక్సిన్ నిల్వకు కోల్డ్‌చైన్ వ్యవస్థను నిర్వహిచండం, సమర్థమైన పర్యవేక్షణ అవసరమాన్నారు. మండల వైద్యాధికారి ప్రవీణ్ కూమార్ ఉన్నారు.

రాష్ట్ర పోటీలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

భువనగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన పోటీల్లో చూపిన ప్రతిభకు గాను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్ననున్నారని ప్రిన్సిపల్ డి.పాపిరెడ్డి, పీడీ డాక్టర్ ప్రసాద్ సోమవారం తెలిపారు. 800 మీటర్ల పరుగు పందెంలో ఎన్ నవీన్, కరాటేలో ఏఎల్ నర్సింహ, వాలీబాల్ బాలికల విభాగంలో టి శివాని, బి దుర్గాభవాని, బాలుర విభాగంలో ఎం మధు, ఎస్‌కె జమాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు అభినందించారు.

మా పాఠశాల ముందు మందు తాగొద్దు



దండం పెట్టి వేడుకుంటున్న చిన్నారులు, ఇన్‌సెట్‌లో పగులగొట్టిన బీరు సీసాల పెంకులు

మోత్కూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం అంగన్‌వాడి కేంద్రం (పాఠశాల) ముందు రోజూ కొందరు వ్యక్తులు మద్యం తాగి, బీరుసీసాలు పగులగొట్టి పోతున్నారు. చిన్నారులు అంగన్‌వాడి కేంద్రానికి వచ్చినప్పుడు గాజు పెంకులు గుచ్చుకుని గాయపడుతున్నారు. ఆదివారం రాత్రి కూడా గుర్తు తెలియని వ్యక్తులు అంగన్‌వాడి కేంద్రం ముందు మద్యం తాగి సీసాలు పగులగొట్టి పోయారు. సోమవారం ఉదయం అంగన్‌వాడి కేంద్రానికి వచ్చిన చిన్నారులు తాము చదువుకునే పాఠశాల ముందు మద్యం తాగవద్దని, బీరు సీసాలు పగులగొట్ట వద్దని దండం పెట్టి వేడుకున్నారు.

చౌటుప్పల్‌లో మద్యం ధ్వంసం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో పట్టుబడ్డ అక్రమ మద్యాన్ని ఎక్సైజ్, స్థానిక పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. సంవత్సర కాలంగా పట్టుబడ్డ రూ. లక్షా 50వేల విలువ గల మద్యాన్ని చౌటుప్పల్ శివారులో పారబోసి ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరిండెంట్ సైదులు, స్థానిక సీఐ మన్మధ కుమార్ పాల్గొన్నారు.

డాటా ఎంట్రీకి సన్నాహాలు

భువనగిరి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వేలో దరఖాస్తులకు సంబంధించి డాటా ఎంట్రీ చేపట్టేందుకు సన్నాహాలు పూర్తి చేసినట్లు ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. భువనగిరి మండలంలో మొత్తం 15వేల228 కుటుంబాలకు 118మంది ఎన్యుమరేటర్లను నియమించి సర్వేను చేపడుతున్నామన్నారు. ఇందుకు 12మంది సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తున్నారని, ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 1511 కుటుంబాలకు సంబంధించి సర్వే చేసినట్లు తెలిపారు. కుల గణన సర్వేకు సంబంధించి 75అంశాలతో సర్వేను పూర్తి చేసేందుకు ఒక్కో ఇంటి వద్ద సుమారు 40 నిమిషాల సమయాన్ని వెచ్చించి, ఎన్యుమరేటర్లు సంపూర్ణంగా వివరాలు సేకిరస్తున్నారన్నారు. సర్వే చేసిన ఫారమ్‌లను ఎన్యుమరేటర్ల వద్ద ఉన్నాయని, ఆ పత్రాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే భద్రపరుస్తున్నట్లు వివరించారు. వారు నమోదు చేసుకున్న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లు కూడా గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామన్నారు. దాని కోసం భువనగిరి శివారులోని న్యూడైమెన్షన్ స్కూల్‌లో దాదాపు 30కంప్యూటర్లను కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. సోమవారం భువనగిరి మండల విద్యాధికారి నాగవర్ధన్‌రెడ్డి, పంచాయతీ అధికారి దినకర్‌లతో కలిసి న్యూడైమెన్షన్ స్కూల్‌ను సందర్శించి కంప్యూటర్లను పరిశీలించారు.

సంక్షిప్తంగా..

ఆలేరు/ ఆలేరు రూరల్: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని 'మేము సైతం' స్వచ్ఛంద 'సేవా సంస' అధ్యక్షుడు కొండ్రాజు వెంకట్రాజు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లను అందజేశారు. హెచ్ఎం మంజుల, డీసీసీ అధికారి దూడల వెంకటేష్, మంద సోమరాజు ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్ : విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు మహాలింగం, హరికృష్ణ, వీరేందర్, మహాదేవ్, నిఖిల్ పాల్గొన్నారు.

మోత్కూరు : అమృత్ 2.0 పథకంలో మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇందిరానగర్ వరకు 4.5 కిలోమీటర్లు మంచి నీటి పైపు లైన్ మంజూరైంది. హైస్కూల్ నుంచి పోతాయగడ్డ వరకు 1.5 కిలోమీటర్లు 300ఎంఎం డీఐ పైపులైన్ నిర్మాణ పనులను మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి ప్రారంభించారు. మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, ఏఈ సురేష్, డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, లెంకల వేణు పాల్గొన్నారు.

మోత్కూరు, : మోత్కూరు హైస్కూల్‌కు చెందిన 1994-95 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు సోమవారం మోత్కూరు వైజే ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో డి.సోమేష్, బుంగపట్ల యాకయ్య, చేపూరి హైమావతి, నిలిగొండ కృష్ణ, గుండు ఆంజనేయులు, కాటం శ్రీను, మరాటి నర్సింహ, రామలింగం, రమేష్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన కవి డాక్టర్ పొండాల మహేష్‌గౌడ్ తెలుగు సాహిత్య కళాపీఠం 14వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రతిభా పురస్కారం అందుకున్నారు కార్యక్రమంలో ప్రముఖ తెలుగు కవి ఓలేటి పార్వతీశం, తెలుగు సాహిత్య కళాపీఠం అధ్యక్షుడు చిక్క రామదాసుతో పాటు కూర్మిళ్ల నర్సింహగౌడ్, బతుకమ్మ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

వలిగొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామపరిధిలో మూసీ నదీ ఒడ్డులో కొలువుదీరిన భీమలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయడంపై ఆ గ్రామస్తులు హర్షం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల కో-కన్వీనర్, నాయకులు బద్దం సంజీవరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పబ్బతి వెంకటేష్, ఉండాడి సత్యనారాయణ, దుబ్బ బిక్షం, బోయిన సుధాకర్, బుల్లెట్ సురి పాల్గొన్నారు.

చేయూత

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మోటకొండూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన జనగాం ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సహకారంతో సోమవారం బీఆర్ఎస్ నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనంతుల జంగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బొట్ల నర్సింహ్మా, మండల మాజీ సెక్రటరీ జనరల్ సిరబోయిన నర్సింగ్ యాదవ్, బొట్ల శ్రీనివాస్, జివిలికపల్లి వెంకటేష్, గంధమల్ల మధు, బొట్ల మహేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన బోదాసు పెద్ద నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా మాజీ సర్పంచ్ పైళ్ల సంధ్యారాణి-ఉపేందర్‌రెడ్డి ఆమె కుటుంబసభ్యులను పరిమార్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అంజేశారు. గ్రామస్థులు వెంకట్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి, బాలయ్య, స్వామి, నర్సింహ, సోములు, కుమార్, గణేష్ పాల్గొన్నారు.

అంత్యక్రియల కోసం..

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నిరుపేద చేనేత కార్మికురాలు చిటుకుల భాగ్యమ్మ అనే అనాథ సోమవారం పద్మశాలి సభావేదిక వద్ద మరణించింది. ఆమె అంత్యక్రియలకు టీఆర్‌ఫౌండేషన్ చైర్మన్, ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు చైర్మన్ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ ఫౌండేషన్ గౌరవ సభ్యులు పాలాది యాదగిరి, ఆకుల రామచందర్, ఆటిపాముల మహేందర్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత జనసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేష్, చేనేత నాయకులు ఏలె భిక్షపతి, కర్నాటి పురుషోత్తం పాల్గొన్నారు.